అలీస్క

యు. ద్రూనినా

అనిల్
20 | మార్చి | 2013



1944వ సంవత్సరం ఆకురాలే కాలం. నాజీ జర్మనీకి వ్యతిరేకంగా సోవియట్ యూనియన్ యుద్ధం చేస్తున్న రోజులు. అప్పుడు ఎస్తోనియా రిపబ్లిక్‌లో ఈ సంఘటన జరిగింది.

నేను ఆర్టిల్లరీ రెజిమెంట్‌లో ఫీల్డ్ నర్సుగా పని చేస్తూ, ముందుకు చొచ్చుకు పోతున్న సైన్యంతోపాటు ప్రయాణం చేస్తున్నాను. వైద్య సిబ్బంది వాహనం వెనక ఉండిపోయింది. వాళ్ల కబురు ఏదీ మాకు అందడం లేదు. నా దగ్గరున్న బేండేజీలు అయిపోతూ ఉన్నాయి. ఉన్న కొద్ది బాండేజీలతో ఎలా సరిపెట్టుకోవాలి అని నాకు భయం పట్టుకుంది.

మేం ఒక చిన్న వ్యవసాయ క్షేత్రాన్ని నాజీలనుంచి తిరిగి స్వాధీనం చేసుకున్నాం. అక్కడ ఒక ఇంట్లోనుంచి ఒక ముసలావిడ నా దగ్గరకి వచ్చింది. ఆమె చేతిలో మకిలిగా ఉన్న తెల్ల కోడిపెట్ట కొక్కొక్కొమంటూ కూస్తూనే ఉంది. ఆ ముసలావిడకి రష్యన్ రాదు. కాని ఆమె అవసరం ఏమిటో మాకు అర్థమైంది. కోడిపెట్టకి కాలు విరిగిపోయింది.

బాధ మనుషులకి మాత్రమే ఉంటుందని అనుకునే రకం కాదు నేను. కాని నాతో ఉన్న సైనికులు ఏమంటారో ఏమో?

నా దగ్గర బేండేజీలు తక్కువగా ఉన్నాయని ఆమెకి వివరించబోయాను. కాని ఆమె కోడిపెట్టని నా చేతుల్లోకి తోస్తూనే ఉంది.

ఇంతలో మా చుట్టూ సైనికులు కుతూహలంతో పోగయ్యారు. ఓ నడి వయస్కుడైన సైనికుడు, "ఆ ప్రాణి బాధతో కొట్టుమిట్టాడుతూ ఉంటే జాలీనాలీ లేదేవిటమ్మాయ్!" నిష్ఠూరంగా అన్నాడు.

నాది కరకురాతి గుండె అని చెప్పి అక్కడ చేరిన వాళ్లంతా ఎన్ని మాటలన్నారో!

నేను మందుల పెట్టె విప్పాను. ఎవరో రెండు కర్రబద్దల్ని చెక్కి ఇచ్చారు. వైద్యశాస్త్రం ప్రకారం యథారీతిగా నేను కోడిపెట్ట కాలికి బద్దలు వేసి కట్టుకట్టాను.

సైనికులకి సున్నిత అనుభూతులు ఉండవని జనం మామూలుగా అనుకుంటూ ఉంటారు.

అలీస్క గురించి రాస్తున్న ఈ సమయంలో కూడా నాకు ఆ ఘటన గుర్తు ఉంది.

ఓ రోజున మా పదిహేనేళ్ల అమ్మాయి అల్యోనా "అమ్ముడు పోవడానికి ప్రయత్నిస్తూ ఉన్న," కుక్క గురించి చెప్పింది.

ఆ చిత్రమైన జీవిని అల్యోనా మాస్కోలో "పక్షుల బజారు" అనే చోట చూసిందట. అల్యోనా ప్రతి ఆదివారం అక్కడికి వెళుతూ ఉండేది. అక్కడ పక్షుల్నే కాక అన్ని రకాల పెంపుడు జంతువుల్నీ అమ్ముతారు.

***

కుక్కల్ని అమ్మేవాళ్లు పొడవాటి రాతి గోడవారనే నుంచున్నారు. ఆ కొత్త వాతావరణం చూసీ, తమకి మోసం జరిగిపోతుందనే అనుమానంతో అక్కడున్న కుక్కలు అటువెళ్లే వాళ్లకేసి మొరుగుతూనే ఉన్నాయి. నిజానికి యజమానులే రహస్యంగా వాటిని మొరగమని పురిపెడుతున్నారేమో. ఎంతయినా జనం కుక్కల్ని కొనేది ఇళ్లని కాపలా కాయడానికి కదా. కుక్క ఎంత మొరిగితే అంత ధర పలుకుతుంది మరి.

గోడపక్కనే నిశ్శబ్దంగా ఒక ఒంటరి ఆల్సేషియన్ కుక్క కూచుంది. ఒట్టి ఎముకల గూడులా, ఆలనా పాలనా లేక వికారంగా తయారైన దానిలా ఉంది. అమ్ముడుపోయిన కుక్క ఒక్కొక్కటే కొత్త యజమానితో వెళ్లిపోతూ ఉన్నప్పుడల్లా దానికేసే అసూయగా చూస్తూ ఉంది ఇది. వరసగా మూడు ఆదివారాలు అది మార్కెట్లో అదే చోట అల్యోనాకి కనిపించింది. కనిపించిన ప్రతి సారి అది ఇంకా దీనంగా ఉంది.

ఈ కథ విన్నాక దాని జాతీగీతీ చూడకుండా దాన్ని పెంచుకుందామని నిర్ణయించుకున్నాం.

ఆ తర్వాతి ఆదివారం జంతువులూ మనుషులూ రద్దీగా ఉన్న ఆ గుంపులో దారి చేసుకుంటూ వెళ్లాం. మనుషుల గొంతుకలు, కుక్కల అరుపులు, పక్షుల కూతలు – అబ్బబ్బ, చెప్పలేనంత గోలగోలగా ఉందక్కడ.

ఉన్నట్టుండి, మెడలకి కట్టిన తాళ్లని గుంజుకుంటూ ఉన్న ఆ బొంగురు కుక్కల మధ్య నాకో వింత జంతువు కనిపించింది. అది మంచుమీద కూర్చుంది. విపరీతంగా బెదిరిపోయినట్టు కనిపించింది. పిల్లి అంత ఉంది. దాని చర్మం ఇసుక రంగులో ఉంది. దానికి మిలమిల మెరిసే పెద్ద పసుపు పచ్చ కళ్లు ఉన్నాయి. దాని శరీరం బిగిసినట్టుగా ఉంది. తోక మంచి బొచ్చుతో ఉంది. కాళ్లు సన్నగా ఉన్నాయి. వెనక కాళ్లు దొడ్డి కాళ్లు.

దాని మెడకి నాటు పట్టీ ఉంది. దానికి ఒక గొలుసు తగిలించి ఉంది. బెదురుగొడ్డు చూపుల కుర్రాడొకడు ఆ గొలుసుని పట్టుకున్నాడు. బహుశా ఆ కుర్రాడు దాన్ని ఇంటికి తీసికెళ్లి ఉంటాడు. కాని తల్లీదండ్రీ ఈ పనికిమాలిన జంతువుని ఎలాగోఅలాగ అమ్మి వదిలించుకోమని ఆ కుర్రాడిని ఇంట్లోనుంచి తరిమి ఉంటారు.

నేను దాని పక్కన చేరి జాగ్రత్తగా దాన్ని నిమరడం మొదలుపెట్టాను. అది చెవుల్ని అప్పళించుకుంది.

"జాగ్రత్తండి, కరుస్తుంది," అని కుర్రాడు హెచ్చరించాడు. కాని నేను దాన్ని అప్పటికే చేతుల్లోకి తీసుకున్నాను. దాని గుండె దడదడ కొట్టుకుంటోంది. దాని ఒళ్లు మొత్తం ఒణుకుతోంది.

నిజానికి అది అడవి జంతువు అనిపించలేదు. అంత దీనంగా, బెదిరిపోయి ఉందది. పైగా అది పిల్ల అని నేననుకున్నాను. అది వయసుకి చిన్నదే అయినా పూర్తిగా ఎదిగిన పచ్చిక బీటి గుంటనక్క అని, దాన్ని కోర్సక్ అంటారని తర్వాత ఎప్పుడో తెలిసింది నాకు.

కోర్సక్ మామూలు గుంటనక్కలాగే ఉంటుంది. కాని కొంచెం చిన్నగా ఉంటుంది. ఇది చాలా ఉపయోగకరమైన జంతువు. ఏమంటే చుంచుల్లాంటి వాటిని మట్టు పెడుతుంది.

మొత్తంమీద కోర్సక్‌ని సొంతం చేసుకున్నాను. రాబోయే చిక్కులేమిటో నాకు తెలుసు. అడవి జంతువుని నాగరిక ప్రపంచంలోకి తెచ్చినప్పుడు చిక్కులు విధిగా వస్తాయి.

అడవి జంతువులతో మన సంబంధాలు ఎప్పుడూ విషాదాంతంగానే ముగుస్తాయి. మచ్చిక కాని ఆ లోకం తన నియమాలని ఉల్లంఘించిన వాళ్లమీద కసి తీర్చుకుంటుంది.

ఈ జంతువుని ఏమని పిలవాలి, అది ఎక్కడినుంచి వచ్చిందీ, దాని ఆహారం ఏమిటైందీ ఆ కుర్రాడిని అడుగుదామనుకున్నాను. దానికి చుంచుల్లాంటి వాటిని తెచ్చి పెట్టలేను కదా. ఇంతట్లోకీ మా అల్యోనా మేం బజారుకి ఎందుకొచ్చామో ఆ కుక్కతో కలిసి సుడిగాలిలా దూసుకువచ్చింది. చిత్రం! అది నిజంగా అల్సేషియనే! ఎలాగైతేనేం తనకో "కొనుగోలుదారు" దొరకడంతో అది మా అమ్మాయి కొంగుకి ముడిపడి పోయినట్టుగా వచ్చింది. అక్కడే దానికి వినీత, ముద్దుగా వినీ, అని పేరు పెట్టేశాం. గుంటనక్కకి అలీస్క అనే పేరు పెట్టాం.

ఇంతలో అలీస్కని అమ్మిన కుర్రాడు ఐపులేకుండా మాయమైపోయాడు. దాంతో అది ఎలా మాన్కోకి వచ్చిందో తెలుసుకోలేకపోయాం. ఒణుకుతూ ఉన్న అలీస్కని చేత్తో పట్టుకుని గుంపులో దారి చేసుకుంటూ నడిచాను.

***

అలీస్క తిండి అలవాట్లు ఏమిటో మాకు తెలియదు, కాని శాకాహారి కాదని మాత్రం మాకు నమ్మకమే. మా అమ్మాయి కోడికాలుని వంట పాత్రలు పెట్టుకునే బీరువా కిందికి తోసింది.

కొంచెం సేపట్లోనే మాకు కరకరమని ఎముకల్ని నములుతూ ఉండడం వినిపించింది. మా అమ్మాయి బీరువా కిందికి తొంగి చూసింది. కరకర చప్పుడు దగ్గులాంటి ధ్వనిగా మారింది. అలీస్కకి బొమిక అడ్డం పడి పొలమారిందేమోనని భయపడ్డాం. కాని అలాంటి దగ్గు ఓ మాదిరి కోపాన్ని కోర్సక్ వెల్లడి చేసే తీరు అని మాకు త్వరలోనే తెలిసింది.

అలీస్క బీరువా కిందనుంచి దూసుకుంటూ వచ్చి తారస్థాయిలో కుక్క పిల్ల మొరిగినట్టు మొరిగింది. అది కోపానికి పరాకాష్ట అట, మాకు తర్వాత తెలిసింది.

బజారునుంచి తీసుకువచ్చేటప్పుడు అలీస్క, వినీ బాగా ఉద్రేకపడి ఉండడం వల్ల ఒకదాని గురించి ఒకటి పట్టించుకోలేదు. కాని ఇంటి దగ్గర యథేచ్ఛగా విహరించే పూర్తి స్వాతంత్ర్యం రావడం వల్ల అలీస్కకి ఇది తన రాజ్యమేననిపించింది. పిచ్చిగా తనకేసి మొరిగే మట్టూ మర్యాదాలేని అలీస్కని సాధువైన వినీ ఆశ్చర్యంగా గుడ్లప్పగించి చూసింది. తను తలుచుకుంటే ఒక్క పంజాతో దాన్ని రపామనిపించెయ్యగలదు.

ఒక పింగాణీ సాసర్లో మాంసం కట్టు పోసి అలీస్క ముందు పెట్టాను. దాన్ని వాసన చూసి, తన తిరస్కారాన్ని బహుస్పష్టంగా వెల్లడి చేసింది: సాసరు మీద సర్రున హొంటేలు కానిచ్చేసింది. మేం దిమ్మెరపోయాం.

గుంటనక్కలు ఈ విధంగా తమ తిండి సామాను దాచేసి, వాసనకి గుర్తుగా ఉండేట్టు చేసుకుంటాయని నాకు తర్వాత తెలిసింది. అది వాటి సహజ గుణం.

МНИ!

మరోపక్క అలీస్క తన కొంటెతనంతో ఈ మాదిరిగా చేస్తోందనీ నాకు అనుమానం కలిగింది. పెట్టిన తిండి నచ్చనప్పుడే అది ఈ "మూత్ర విసర్జన" నాటకం ఆడేది.

రాత్రిపూట అలీస్క గదిలో ఉడత మాదిరి గెంతులేసేది. కుర్చీలమీదకి, అక్కడినుంచి నేలమీదకి ఉరుకుతూ ఉండేది. గుంటనక్కలు నిశాచరులే అనుకోండి. కాని మనం నిశాచరులం కాదుగా, అందుకని రాత్రిళ్లు దాన్ని బాత్‌రూంలో పెట్టి గడియ వేసేద్దామని అనుకున్నాం.

రోజంతా భోజనాల గదిలోకి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు గబగబా ఒక్క ఉదుటున తలుపు మూసేస్తూ ఉండేవాళ్లం. లేకపోతే ఈ చురుకైన గుంటనక్క హాల్లోకీ, అక్కడినుంచి గదిలోకీ వచ్చేస్తుందని భయం. 'జూ' వాసన కొట్టడానికి ఒక్క గది చాల్లెమ్మని అనుకున్నాం.

కాని మొత్తం ఇల్లు అంతా 'జూ' వాసన వ్యాపింపచెయ్యాలనే మంకుపట్టు అలీస్కకి ఉన్నట్టుంది. నిజమైన నక్క జిత్తులతో పట్టు సడలకుండా మళ్లీ మళ్లీ ప్రయత్నించింది.

నేను ఒక దారానికి మాంసం ముక్కని కట్టి, పిల్లితో ఆడుతున్నట్టుగా అలీస్కతో ఆడుతూ దాన్ని హాల్లోకి రప్పించేందుకు ప్రయత్నం చేశాను. అలీస్క రావడమైతే హాల్లోకి వచ్చేది, కాని ఎవరైనా భోజనాల గది తలుపు ముయ్యబోయారో టక్కని వాళ్లని దాటుకుంటూ దూసుకుపోయి మళ్లీ చేతికి చిక్కేది కాదు. "నాజూకైన" కోసు కళ్లు మిలమిల మెరుస్తూ ఉంటే నోరు చాచి ఇకిలిస్తూ మహా సంబరపడిపోయి మమ్మల్ని ఆట పట్టించేది.

ఇంట్లోవాళ్లం అందరం కలిసి ఒక చిక్కు పరికరాన్ని తయారుచేశాం. దీనికి ఒక తాడు ఉంటుంది. ఆ తాడు కొస ఒకటి అల్యోనా చేతిలో ఉంటుంది, ఇంకో కొస తలుపు హేండిల్‌కి కట్టి ఉంటుంది. మొదట దీనివల్లా పని జరగలేదు. తలుపు మూసుకునేటట్టు అల్యోనా తాడు లాక్కునేముందే అలీస్క లోపలికి దూరేసేది. ఎన్నోసార్లు ప్రయత్నించిన తరవాత ఈ పథకం పారింది. బహుశా అలీస్కకి ఈ ఆటలో విసుగొచ్చి ఉంటుంది. ఎలాగైతేనేం అలీస్కని బాత్‌రూంలో ప్రవేశపెట్టాం.

నాకు ఈ సాహస కృత్యంతో ఉద్రేకం ఎక్కువైపోయి నిద్రపట్టింది కాదు. నిద్ర మాత్ర వేసుకున్నాను. కునుకు పడుతోంది. ధనామని ఎదో విరిగిపడిన చప్పుడు అయింది. నేను ఒక్క ఉదుటున లేచి బాత్‌రూంలోకి పరిగెత్తాను. ఆ దృశ్యం చూసి నా మతిపోయింది. అలీస్క వాష్‌బేసిన్‌లో వెనక కాళ్లమీద నుంచుని ప్రతి వస్తువునీ – టూత్ బ్రష్‌లు పెట్టిన గ్లాసుని, పళ్లపొడి డబ్బాని, సబ్బుని, షాంపూని, క్రీమ్ జార్‌ని – ముందు కాళ్ల పంజాలతో కిందికి తోసేస్తూ ఉంది. అన్నీ ముక్కలు ముక్కలుగా పగిలిపోయాయి. వాటిలో ఉండే సరుకు ఒలికిపోయి, చెదిరిపోయాయి.

గుంటనక్క తాపీగా నాకేసి ముఖం తిప్పింది. దాని మూతినిండా పళ్లపొడి అంటుకుపోయింది. అది మళ్లీ నోరు ఇకిలిస్తూ పెట్టింది.

ఈ సంతంతా తుడిచి శుభ్రం చేశాను. బాత్‌రూంలోనుంచి తీసెయ్యగల వాటినన్నిటినీ అక్కడినుంచి తీసేసి మరో రెండు నిద్రమాత్రలు వేసుకుని నిద్రపోయాను. అలీస్క అల్లరి చెయ్యగల వస్తువులేవీ ఇక బాత్‌రూంలో లేవు కదా అని అనుకుని మరీ హాయిగా నిద్రకి ఉపక్రమించాను.

రాత! నా హాయి, నిద్ర రెండూ క్షణికమే అయ్యాయి. గుంటనక్క కుయుక్తుల్ని నేను తక్కువ అంచనా వేశాను.

వింత గోకుడు చప్పుడు అయి నాకు మెలకువ వచ్చేసింది. తిట్టుకుంటూ లేచాను. వెళ్లి చూద్దును కదా అది స్నానాల తొట్టిలో, పిల్లలు మంచుమీద పైనుంచి కిందికి జారినట్టుగా, జారుతోంది. బహుశా జారేటప్పుడు బ్రేక్‌లా ఉండాలనేమో, పంజాలతో ఆనుకుంటూ అలా చేస్తోంది. అదీ నా మెలకువకి కారణమైన గోకుడు చప్పుడు.

ఇక రాత్రి అయితే తెల్లవార్లూ అలీస్క ఈ జారుడుబండ ఆట ఆడుకుంటూనే ఉంటుందనేది తేలిపోయింది. లేకపోతే తనే మరో వినోదం సృష్టించుకుంటుంది...

***

అలీస్క మా ఇంటికి వచ్చిన రెండురోజులకి దానికి ఒంట్లో బాగా లేదని గమనించాను. తన పరుపుమీద పడుకోకుండా (మరీ వేడిగా ఉందేమో!) చల్లగా ఉన్న పలకలమీద పక్కవాటుగా వాలి మెల్లిగా మూలగడం మొదలుపెట్టింది. దాని శ్వాస వేడిగా ఉంది, ముక్కు పొడారిపోయి వెచ్చగా ఉంది.

ఏమయిందోనని చెప్పి అలీస్కని పశువుల డాక్టరు దగ్గరికి తీసికెళ్లాను. అక్కడ అందరి కళ్లూ దీనిమీదే లగ్నమైపోయాయి. మాకు క్యూలో ఉండక్కర్లేదని మినహాయింపు ఇచ్చారు.

మొదటగా వాళ్లు ఒణికిపోతూ ఉన్న ఈ రోగి టెంపరేచర్ కొలిచారు, 44.5 సెంటీగ్రేడ్ ఉంది. ఈ టెంపరేచర్ చాలా ఎక్కువే.

డాక్టరు అలీస్కని మొత్తం తట్టి చూసి దానికి "మెంబ్రేనస్ న్యూమోనియా" వచ్చిందని చెప్పాడు.

అలీస్కకి బజార్లో ఉన్నప్పుడు జలుబు చేసి ఉండాలి. చాలాసేపు కదలకుండా మంచుమీదనే కూర్చుని, ఆందోళనతో నోరు తెరుచుకుని తేమగాలి పీల్చడంతో జలుబుచేసి ఉంటుంది.

"జబ్బు ఎక్కువగా ఉంది. కానీ ఇంజెక్షన్‌కి అడవి జంతువు అదిరిపోతుంది. మాత్రలే ఇచ్చి చూద్దాం," అన్నాడు డాక్టరు.

తర్వాత సమస్య అలీస్కతో మందు తాగించడం. రోజుకి మూడు సార్లు గుంటనక్కని జిత్తులు చేసి ఓడించడం నిజంగా యజ్ఞమే.

పచ్చికార్జం ముక్కకి లోగంటు చేసి ఈ మాత్రలని అందులో పెట్టాను. మొదటిసారి పని జరిగింది. అలీస్క కార్జాన్ని మాత్రలతో మింగిన తర్వాత అది ముఖం వికారంగా, చీదరించుకుంటున్నట్టుగా పెట్టింది.

రెండవసారి అలీస్క కార్జం తినేసి మాత్రల్ని వదిలేసింది.

మూడవసారి మొత్తం వదిలేసింది.

మళ్లీ పక్కకి ఒరిగి, అల్లరి చెయ్యని బుద్ధిమంతుడైన పిల్లాడిలాగా మెల్లిగా మూలుగుతూ, బొచ్చుతో గుబురుగా ఉన్న తోకని కాళ్ల మధ్య పెట్టుకుని పడుకుంది. ఆరు నూరైనా, నూరు ఆరైనా అలీస్కతో మాత్రల్ని మింగించడం అసాధ్యం అని తేలిపోయింది. మళ్లీ అలీస్కని పశువుల డాక్టరు దగ్గరికి తీసికెళ్లాను.

"ఇంక చేసేదేం లేదు. ఇంజక్షనే ఇచ్చి చూద్దాం," అన్నాడు.

అలీస్క వెనక కాలు సాగదీసి పట్టుకుంది నర్సు. డాక్టరు దబ్బనంలాంటి బండ సూది ఉన్న సిరంజి తీశాడు... నేను నోరు వెళ్లబెట్టి చూస్తున్నాను. కాని ఏ ఇబ్బందీ లేకుండానే జరిగిపోయింది.

అలీస్క కోలుకుంటోంది. కాని రోజుకి మూడు ఇంజెక్షన్లు ఇవ్వాలి. రోజుకి మూడుసార్లు డాక్టరు దగ్గరికి దాన్ని తీసికెళ్లే తీరిక నాకు లేకపోయింది. అప్పుడు మా ఆయన ఒక వీరోచితమైన నిర్ణయం తీసుకున్నారు. ఆయన జన్మలో ఎన్నడూ సిరంజి చేత్తో పట్టుకుని ఎరగరు. కానీ తనే అలీస్కకి ఇంజక్షను ఇస్తానని అన్నారు.

అనుమానంగా చూసే అలీస్కని ఒళ్లో పట్టుకుని కూర్చున్నాను. మా ఆయన సిరంజి నింపి, దాని వెనక కాలిని మెల్లిగా వెనక్కి లాగి, అక్కడ అయొడిన్ పూసి, నిబ్బరంగా సూదిని లోపలికి గుచ్చారు. అలీస్క కంపించిపోయి, తనని వెనకనుంచి ఎవరు దుర్మార్గంగా కరిచారా అని చూడబోయింది. కాని సిరంజి పిస్టన్ గట్టిగా నొక్కినా ముందుకు వెళ్లలా, సూదికి ఏదో అడ్డం తగిలి ఉండాలి. అనుభవంలేని మా డాక్టరుగారు ముఖం చిట్లించుకుని దాన్ని ఇవతలికి లాగారు. అప్పుడు చూశాను! నా కుడి చెయ్యి అలీస్క నోట్లో ఉంది! మా ఆయన మరోసారి ఇంజక్షన్ చెయ్యాల్సి వచ్చింది. అలీస్క గొలుసుని కొరకడం గుర్తువచ్చి కళ్లు మూసుకున్నాను. తనని పీడించేవాళ్లని కరవదా మరి? తన బాగుకోరే మేం నొప్పి కలిగిస్తున్నామని దానికి ఎలా తెలుస్తుంది?

కాని సరిగ్గా ఆ విషయమే దానికి ఏదో సహజ ప్రేరణ వల్ల తట్టి ఉండాలి. లేదా నేనంటే చెప్పలేనంత నమ్మకమైనా ఉండి ఉండాలి. ఏమైనా మా ఆయన ఇంజక్షన్ చేసేటప్పుడు కొంచెం పళ్లు బిగపట్టుకుంది, అంతే.

ఇక ఉరుకులు పరుగులుమీద కోలుకోవడం మొదలుపెట్టింది అలీస్క. కోలుకుంటోందని చెప్పడానికి చాలా నిదర్శనాలు ఉన్నాయి - మళ్లీ యథాప్రకారం తన కొంటె చేష్టలు మొదలుపెట్టింది.

మా ఇంటి ఆరాధ్యంగా, కుటుంబం అంతా కొలిచే ప్రతిమగా తయారవడానికి అలీస్కకి ఎంతో కాలం పట్టలేదు.

దాని అభిమానం సంపాదించడానికి మేం ఒకళ్లతో ఒకళ్లం పోటీ పడ్డాం. దానికి నేనంటేనే బాగా ఇష్టం అవడం నాకు చెప్పలేనంత గొప్పగా అనిపించింది.

నన్ను మాత్రమే తనని లేవనెత్తనిచ్చేది. అప్పుడు కూడా మొదటి కొన్ని క్షణాలూ అది ఒణికేది, చెవులు అప్పళించుకునేది. మనుషులతో సంబంధం కలిగించుకోవడమనే అనుభూతితో దాని అడవి జంతువు సహజ ప్రవృత్తి సంఘర్షించేదేమో.

దానికి చేత్తో తిండి అందించే ధైర్యం ఉన్న వ్యక్తిని నేను మాత్రమే. అది ఎప్పుడూ నా చేతిలోంచి చిన్న చిన్న ముక్కలు మెల్లిగా తినేది. నా వేళ్ల గురించిన భయం ఉండేది కాదు నాకు.

ఓసారి మా ఆయన తను కూడా అలీస్కకి చేత్తో తినిపిస్తానని చెప్పి ఒక కార్జం ముక్కని పెట్టారు. అలీస్క దయతలిచి తీసుకుంది. తీసుకున్నాక ఆ ముక్కని నేలమీద పెట్టి మెరుపులాగా దానిమీదకు గెంతింది. నాకు లంచం పెట్టడానికి ప్రయత్నించవద్దు, నీ వేళ్లు జాగ్రత్త అని చెపుతున్నట్టు ఉంది దాని చేష్ట. తర్వాత హుందాగా కార్జాన్ని తినడం మొదలుపెట్టింది.

ఇక మా అమ్మాయికైతే, అలీస్క పేరు చెపితే గజగజే, అంతకంటే వేరే మాట వాడలేం. కరవాలన్నట్టుగా మా అమ్మాయి కాళ్లమీదకి పోయేది. పెద్ద పెద్ద అంగలతో ఇల్లంతా పరిగెత్తేసేది, "అమ్మోయ్," అని అరుస్తూ నా దగ్గరికి శరణువేడుతూ వచ్చేది.

అలీస్కకి అయిష్టత కలగడానికి అల్యోనా ఏం చేసిందో? లేదా అల్యోనా బిగ్గర గొంతుక, కుదుపు కదలికలు అలీస్కకి ఇష్టం లేకపోయాయేమో? ఎవరికి తెలుసు?



నేను బహు జాగ్రత్తగా కదలడం, మాట్లాడ్డం నేర్చుకున్నాను. అలీస్క వచ్చిన దగ్గరనుంచీ నేను నడవడం లేదట జారుతున్నానట, మాటలు పలకడం లేదట కూస్తున్నానట... అలా అని మా స్నేహితులు నన్ను వేళాకోళం చేసేవారు.

పెంపుడు జంతువుని కాకుండా అడవి జంతువుని ఎందుకు పెట్టుకున్నావని మిత్రులు కొంతమంది నన్ను అడిగారు. ఎందుకంటే ఏం చెప్పను!

అల్లరి చిల్లరిగా అపనమ్మకంతో ఉండే ఆ ప్రాణిని నా ప్రేమ ఆకట్టుకునే కొద్దీ మా మధ్య అవగాహనా, విశ్వాసాల పాశాలు విస్తరించుకోవడం చూసి నాకు సంతోషం కలిగింది.

నేను ఇంటికి తిరిగి వచ్చినప్పుడు లిఫ్టు తలుపు మూసుకునే చప్పుడుకే అలీస్క చెవులు రిక్కించి, కీచుమని అరుస్తూ కుక్కలాగా గుమ్మం దగ్గరికి పరిగెత్తుకొస్తుందని తెలిసి నాకు ఆనందం కలిగింది. నేను లోపలికి అడుగు పెట్టినప్పుడు నా కోసం కాకుండా ఏదో పనిమీద వచ్చినట్టు నటించేది. గుంటనక్క స్వాతిశయం ఉన్న జంతువు కదా!

కాని అలీస్కలో నాకు గొప్పగా కనిపించింది అదే – ఆ గర్వం, ఆ స్వతంత్ర భావన.

రోజూ సాయంత్రం మానవ చింతలతో వేదన పడి, అలిసిపోయి నిరుత్సాహంగా సోఫామీద ముణగ లాక్కుపోయి కూర్చున్న నా ఒళ్లోకి హఠాత్తుగా ఆ అడవి జంతువు దూకినప్పుడు నాలో ఎంత సంతోషం ఉరకలు వేసేది!

ఇక కొంటె చేష్టలా! కన్నబిడ్డల కొంటె చేష్టల వల్ల తల్లులకి పిల్లలమీద ప్రేమ తగ్గుతుందా?

అలీస్క స్వభావంలో మామూలుగా తిమ్మడి చేష్టలు ఎక్కువ. దేన్నో ఒకదాన్ని పాడుచేయకపోతే దానికి నిద్రపట్టేది కాదు. దేన్నైనా చించెయ్యడమో, పగలగొట్టడమో, కొరకడమో ఏదో ఒకటి చెయ్యాల్సిందే. అందుకని మేం ఇంట్లో లేనప్పుడూ, రాత్రిళ్లలో దాన్ని "సొంత మకాం"లో, అంటే బాత్‌రూంలోనో, హాల్లోనో బంధించి ఉంచేసేవాళ్లం.

కాని అది ఎప్పుడూ ఇలాంటి ఏర్పాటుకి ఒడబడేది కాదు. తడవ తడవకీ గది గుమ్మాల కింద గోకేది, కన్నాలు తవ్వేది. ఒక రోజు పొద్దుట చూస్తే హాలు గోడకి అతికించిన కొయ్య చిలకలు సగం ఊడిపోయి ఉన్నాయి, మాకు మతిపోయింది.

మేం ఇంటి దగ్గర ఉన్నప్పుడు అలీస్కని పిలిచి చేరదీసే వాళ్లం, పిలవకపోతే తనే చక్కా వచ్చేది. దానితో చిక్కేమిటంటే ఎవరూ దూరడానికి సందులేని మూలకిపోయి అక్కడ తిష్ట వేసేది, ఆ జాగానంతటినీ తన భోగంగా అనుభవించేది.

ఎప్పుడైనా, ఏ బీరువా కిందనుంచో దాని బొద్దు తోక పట్టుకుని ఇవతలికి లాగే కనీవినీ ఎరగని స్వాతంత్ర్యాన్ని నాకు ప్రసాదించేది. బెదిరించేటట్టు దగ్గేది, గుర్రుమనేది, కరవబోయినట్టు విసురు చూపించేది. కాని ఇంత చేసినా నన్నెప్పుడూ కరవలేదు.

అలీస్కకి మరో చిత్రమైన అలవాటు ఉంది – టెలిఫోన్ తీగల్ని కొరకడం. కాని మాకు అన్నిటికంటే బాధ కలిగించింది ఇంకోటుంది. ఇల్లంతా, మెట్లదాకా కూడా వ్యాపించిన ఘాటైన "జూ" వాసన.

నేను బస్సు ఎక్కినా, మెట్రో ఎక్కినా జనం ఏదో వాసన తగిలినట్టు ముఖం పెట్టేవారు. మా బట్టలన్నీ అలీస్క వాసనే. ఒకసారి మెట్రోలో ఎవరో విషపుచ్చి ముసలామె! "అబ్బ మేక వాసన. కళ్లకి షోగ్గా రంగు వేసుకున్న ఈ ముచ్చటైన మనిషి మేక వాసన కొడుతోంది," అనడం నా చెవిన పడింది. ఆ వాసన పోయే మార్గం లేకపోయింది. ఎన్ని డియొడెరంట్లూ దాన్ని ఏం చెయ్యలేకపోయాయి.

ఆ రోజుల్లో నేను ఎప్పుడూ గుడ్డ పీలికలు పట్టుకుని నేలమీద తుడుస్తూ ఉండేదాన్ని. అప్పుడే బాగా పామిన నేలమీద పళ్లు తోముకునే ద్రావకం ధారాళంగా పోసేసేదాన్ని. అయినా ఆ "జూ" వాసన తగ్గేది కాదు.

అప్పుడు మా స్నేహితులొకరు భారతదేశం నుంచి వెలలేని కానుకని తెచ్చి ఇచ్చారు – అగరువత్తులు. వీటికి మేం "యాంటీ ఫాక్సిన్" (నక్క వాసనకి విరుగుడు) అని పేరు పెట్టాం. ఎవరైనా మా ఇంటికి వస్తారనుకున్నప్పుడు ఒకటో, రెండో అగరువత్తులని వెలిగించేదాన్ని. అవి కాలుతూ ఉంటే మత్తెక్కించే చక్కని సువాసన ధూపం గదుల్లో



వ్యాపించేది, అలీస్క వాసనతోపాటు. "యాంటీ ఫాక్సినూ" నూటికి నూరుపాళ్లు 'అలీస్క ప్రూఫ్'గా ఉండలేదు.

అదృష్టవశాత్తూ వసంత రుతువు వచ్చి మా ఇక్కట్లని దూరం చేసింది. మాషా మామ్మ ఇంటిని పల్లెలో అద్దెకి తీసుకున్నాం. మొత్తం మా జంతుపటాలంతో – అలీస్క, వినీ, పిల్లులతో సహా అక్కడికి మారాం. అలీస్కకి కుక్కలదొడ్డి ఇచ్చాం. మాంచి భోగంగా ఉండే మకాం, విశాలమైన ఆవరణ, చుట్టూతా కంచె.

మర్నాడు అలీస్క ఉన్న దొడ్లో వినీ, కలిసి సల్లాపంగా ఆడుకుంటూ ఉండడం చూసి నాకు ఆశ్చర్యం కలిగింది. రెండు కుక్కపిల్లలు సరదాగా ఆడుకుంటూ దొర్లినట్టు అవి దొర్లుకుంటున్నాయి.

కాని అలీస్క ఉన్న దొడ్డిలోకి వినీ ఎలా వెళ్లింది? ఎత్తైన కంచెలో ఎక్కడైనా రెండు మీటర్ల ఖాళీ జాగా చేసిందా ఏమిటి?

పిల్లిలాగా పంజాలతో కంచె పట్టుకుని వినీ పైకి ఎక్కింది. ఆ దృశ్యం చూడ్డానికి ముచ్చటగా ఉందని కాదు కానీ కనీసం నా కళ్లతో నేను చూశాను.

వినీ అలీస్కని రాత్రికాని, పగలుకాని ఎప్పుడైనా వెళ్లి కలుసుకోగలిగేది. వినీని చూడగానే అలీస్క ఆవరణ అంతా ఉరుకులెత్తేసేది. అలీస్క రాజ్యంలోకి వినీ తపామని దూకే దాకా అలానే ఉండేది. తర్వాత వినీ దాన్ని తరమడం మొదలుపెట్టేది. తరమడాలూ, తరిమించుకోవడాలూ తారస్థాయికి చేరుకునేవి. మధ్యమధ్యలో అలీస్క టక్కున పక్కకి మళ్లిపోయేది. దాంతో వినీకి బ్రేకు వేసుకునే వ్యవధి లేక తిన్నగా కంచెలోకి దూసుకుపోయేది.

అలీస్క, వినీ ఒకే కంచంలో తినేవి. ఆ ఆవరణకి అలీస్కయే యజమానురాలు అవడంతో ఎప్పుడూ మొదట దాన్నే తిననిచ్చేది వినీ. కాని అలీస్కకి ఆశ ఎక్కువ. అంతా తినలేనేమో అనే ఊహ దానికి వెర్రెక్కించేసేది. ఆబగా మెక్కేసేది, దాంతో పొలమారేది. నమలకుండానే పెద్ద పెద్ద ముక్కల్ని గుటుక్కున మింగేది. ఇక కడుపు పట్టదు అనిపిస్తే కంచంలోనుంచి పెద్ద ముక్కని పళ్లతో కరుచుకుని దూసుకుపోయేది. స్నేహం స్నేహమే, వంగతోట దగ్గర ఎవరూ బావ కాదు కదా.

దరిమిలా తన నిధిని పూడ్చి పెట్టుకునేది. తర్వాత వెర్రెత్తిపోయి, దాన్ని తవ్వి తీసి మళ్లీ పరుగులు పెట్టేది.

అలీస్క క్రీడల్ని తొణక్కుండా, బెణక్కుండా వినీ చూస్తూ ఉండేది. తర్వాత అంతే స్థిమితంగా అలీస్క దాచేసిన తిండిని తను తినేది.

వినీ అంత మంచి నేస్తం అలీస్కకి దొరికినందుకు మేం సంతోషించాం. ఒకసారి కుక్కపిల్ల కుంయ్‌మన్నట్టుగా ఏడుపు వినిపించింది. ఏమిటీ మొరపెట్టుకుంటోంది అలీస్క అని చూశాం. ఆట మంచి పసందుగా ఉన్న దశలో వినీ దాన్ని వదిలి పెట్టేసింది. తనని వదిలిపెట్టి వెళ్లిపోయిన నేస్తం వెనకాలే కంచెమీదకి ఎగబాకడానికి అలీస్క ప్రయత్నిస్తోంది, కాని జారిపోతోంది. మళ్లీ ఎక్కబోతోంది, మళ్లీ జారిపోతోంది...

ఒకోసారి వినీ వరసగా మూడేసి రోజులు పత్తా ఉండేది కాదు. తర్వాత పీక్కుపోయి, దీనంగా, గాట్లతో తిరిగి వచ్చేది. తిరిగివచ్చినప్పుడు వినీ గేటు దగ్గరనుంచి తన దొడ్డి దాకా పొట్టమీద పాక్కుంటూ వెళ్లేది. మళ్లీ కొన్ని రోజులు ఎక్కడికీ కదలకుండా శరీరానికీ, మనసుకీ తగిలిన గాయాలనుంచి కోలుకుంటూ ఇంటి దగ్గరే ఉండేది. తర్వాత మళ్లీ చెక్కేసేది. అలీస్క పూర్వంలాగా హుషారుగా ఉండడమే లేదు. కళ తగ్గిపోయింది, మూతి ముడుచుకుని ఉండేది.

అప్పుడు ఒక రోజున ఒక సాహస యాత్ర చేసి వినీ మళ్లీ అలీస్క ఆవరణలో ప్రత్యక్షమైంది. అలీస్క వెర్రి ఆనందంతో ఉరకలు వేస్తుందని మేమనుకున్నాం. కాని అలీస్క ముఖం ముడుచుకునే ఉండిపోయింది. సరదాగా గెంతులు వేద్దామని వినీ ఎన్ని చిట్కాలు చేసినా లాభం లేకపోయింది. వినీని ఏం పట్టనట్టుగా చూసి అలీస్క పెద్దగా ఆవలించి వెనక్కి తిరిగి తన మకాంలోకి వెళ్లిపోయింది.

వాతావరణం బాగుంటే కనక నేను అలీస్క ఆవరణ లోపలికి తేలికైన మడత బల్లని తెచ్చేదాన్ని. దాని కాళ్లమీద అలీస్క కొరికిన గుర్తులు ఉండేవి.

అలీస్కతో ప్రతి గంట, ప్రతి క్షణం సంబంధం ఉంచుకోవాలనీ, దానికి దగ్గరగా ఉండాలనీ ఆతృతగా ఉండేది నాకు. ఆ ఆవరణ లోపలే పని చేసుకోవాలని నాకు

అనిపించేది. రోజువారీ యాతనలనుంచీ, ఆందోళనలనుంచీ కంచె నన్ను కాపాడుతూ ఉన్నట్టుండేది!

'నన్ను చూడు' అన్నట్టుగా అలీస్క త్వరపెట్టేది. టేబిల్ కోళ్లమీద గట్టిగా దాడి చేసేది. తర్వాత నా కాళ్లమీద దాడి చేసేది. అయినా నా ఏకాగ్రతను పిసరు కూడా తప్పేది కాదు. దానితో పరధ్యానంగానే ఆడుకునేదాన్ని, నా లోపలి ఏకాగ్రత చెడిపేది కాదు. ఒక ప్రాణిని సకల అనర్థాలనుంచీ కాపాడడం నా చేతిలో ఉంది. అలాంటి ప్రాణి ఒకటి ఈ ప్రపంచంలో నా బాధ్యతలో ఉందన్న భావం నాకు ఆనందంగా ఉంది.

ఒక్కొక్కపుడు నేను అలీస్కని అడవిలోకి షికారు తీసికెళ్లేదాన్ని. చేతుల్లో చిన్న పిల్లని తీసికెళ్లినట్టు దాన్ని ఎత్తుకెళ్లేదాన్ని. మెళ్లో తాడు కట్టి నడిపిస్తే నడవడం దానికి ఎంతకీ చాతకాలేదు. అలీస్కకి ఆ షికార్లు సరదాగా ఉండేవి. అడవిలోని విశేషాలను కోతిలాగా గుచ్చిగుచ్చి చూసేది.

ఒకసారి ఒక సంఘటన జరిగింది. దాంతో అలీస్క పట్ల నాకు బ్రహ్మాండమైన గౌరవం కలిగింది.

యధాప్రకారం మేం షికారుకి వెళ్లాం. ఆకురాలే కాలంలో పొడిగా ఎండగా ఉండే ఒక రోజు. ఆవేళ ఆకాశం ప్రశాంతంగా, కొంచెం దిగులుగా ఉంది. మధ్యాహ్నం పూట విశ్రాంతిగా వేసవికాలం గడపడానికి వచ్చిన వాళ్లంతా వెళ్లిపోయారు. ఎక్కడా ఒంపులు, మలుపులు లేని నిబ్బరమైన దారిలో వెళుతున్నాను.

బర్చ్ చెట్ల కాండాలు స్వచ్ఛంగా ఉన్నాయి. ఎండ బాగా కాస్తోంది. చీమ చిటుక్కుమంటే వినిపించేటంత నిశ్శబ్దంగా ఉంది. ఉన్నట్టుండి ఓ ఆడమనిషి కెవ్వుమనడం వినిపించింది. నేను గిరుక్కున అటు చూశాను. లేగదూడలా ఉన్న తెల్లటి బొచ్చుకుక్క ఒకటి, మా వెనకాల కిమ్మనకుండా లగెత్తుకుని వస్తోంది. అది పైరేట్ కుక్క, దక్షిణ రష్యా వేటకుక్కల జాతిలో భయంకరంగా ఉండే రకం కుక్క.

పైరేట్ కాపలా కాసే తోట దరిదాపులకి అక్కడుండే కుర్రాళ్లెవరూ పోరు, పెద్దవాళ్లూ వెళ్లరు.

ఆ కుక్క నిరాఘాటంగా మా మీదకి వచ్చేస్తోంది. ఎత్తు మడమల బూట్లు తొడుక్కున్న లావాటి ఆవిడ ఎవరో అరుస్తూ కుక్క మెడకి కట్టే పట్టీ ఊపుతూ దాని వెనకాల కొంచెం దూరంలో వస్తోంది. కుక్క ఇంకా ఇంకా దగ్గరగా వచ్చేస్తోంది. పరిగెత్తి ప్రయోజనమూ లేదు – నిజానికి అది మరీ ప్రమాదకరం. ఉన్నచోటనే ఉండిపోయి, యజమానురాలు గొలుసు పట్టుకువచ్చేదాకా, పైరేట్‌తో మాట కదలేసి దాని దృష్టి మళ్లించడమే మెరుగు. భయపడిపోతున్నట్టు కనిపించకూడదు, అది మరీ ముఖ్య విషయం.

కాని అలీస్కకి తప్పించుకుపోయే వ్యవధి ఇంకా ఉంది. ఒకవేళ నాకది ఇక ఎన్నటికీ కనిపించకపోయినా కూడా వెంటనే దీన్ని వదిలెయ్యాలి... అలీస్కని నేల మీదకి దింపాను. అది పొదల్లోకి జారిపోయింది.

కుక్క అలీస్కని చూడలేదో లేకపోతే నేనే దానికంటే మంచి వేట అనుకుందో తెలీదు మరి, నాకేసే మొరగకుండా వచ్చేస్తోంది. అలా మొరగకుండా రావడమే భయంకరమైన సంగతి. నేను లావాటి బర్చ్ చెట్టుకి ఆనుకుపోయాను. కుక్కకీ నాకూ మధ్య రెండు మీటర్ల దూరం కూడా లేదు. “పైరేట్, మా అమ్మవు కదూ,” అని నేను తియ్యగా బతిమాలుతున్నట్టుండే గొంతుకతో అన్నాను. “నన్ను కరవకేం...”

వచ్చే వచ్చే కుక్క ఆగిపోయింది. దాని బిత్తరపాటు చూసి నేను ఇంకా నిబ్బరంగా అన్నాను: “నువ్వు, ఎంత ముచ్చటైనదానివో, తెలివైనదానివో, మంచి కుక్కవో...”

ఆ క్షణంలో పైరేట్ ఎగరడానికి ఊపుతో ఉండడం కనిపించింది. నా మెడ పట్టుకోవాలని దానికి ఉండొచ్చు. మొదటిసారి బాగా ఎత్తు ఎగరలేదు. రెండోసారి ఎలా తప్పించుకున్నానో నాకే తెలీదు.

యజమానురాలు కళవిళ పడిపోయి వస్తూ ఉండడం కనుకొలకుల్లోంచి చూస్తూ పైరేట్ మూడో గెంతు గెంతుతుందని చూస్తున్నాను. మూడోసారి గెంతడానికి



తయారవుతూ నేలమీద కూర్చున్న పైరేట్ ఉన్నట్టుండి మొయ్యోమని అరిచింది. నా కళ్లని నేను నమ్మలేకపోయాను. మా చిన్న ధైర్యవంతమైన అలీస్క బుల్‌డాగ్‌లాగా పైరేట్ వెనక కాలిని గట్టిగా కరిచింది...

పైరేట్ మెరుపుతీగలాంటి విసురుతో మూతి ఎగరేసింది కాని దాని కోరలు గాలిలోనే కరుచుకున్నాయి. అలీస్క అప్పటికే దౌడు తీసుకుపోతోంది. దాని బొచ్చు తోక ఎత్తుగా ఉంది. తోకని పైకి ఎత్తగానే దాని పొడవు సగం తగ్గిపోయింది, దాంతో దాన్ని పట్టుకోవడం మరింత కష్టం అయింది. పైరేట్ నా గురించి సొంతం మరిచిపోయింది. అలీస్క వెనకాల దౌడు తీసింది.

నేను అమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నాను. అడ్డదారమ్మట పడి ఇల్లు చేరుకున్నాను. ఆ కుక్కబారినుంచి అలీస్క తప్పించుకోలేదన్న అనుమానం నాకు లేదు. కాని ఇంటికి రాగలదా తిరిగి?

నేను దాని దొడ్డి దగ్గరికి పరిగెత్తి వెళ్లి చూశాను. అలీస్క హాయిగా కప్పుమీద పడుకుని ఉంది. ఆయాసంతో ఎగిసి పడే డొక్కలవల్ల అది పరిగెత్తుకుంటూ వచ్చిందని తెలుస్తోందంతే. లేకపోతే మొత్తం వాలకం, ఆ పడుకోవడం, కళ్లు సగం మూసుకోవడం "ఏమిటి సంగతి? ఆత్మగౌరవం ఉన్న ఏ నక్కైనా చేసేటట్టే చేశానంతే," అంటున్నట్టు ఉంది.

అక్టోబరు నెల వచ్చింది. వాన కుండపోతగా మొత్తేస్తూ ఉంది. కాని అలీస్కని ఏం చేయాలో తేల్చుకోలేక మేం ఇంకా పల్లెటూళ్లోనే ఉన్నాం. ఒకటి మాత్రం ఖాయంగా తేలింది- దాన్ని పట్నవాసం కొంపలో ఉంచుకోవడం అసాధ్యం.

అక్టోబరు నెలాఖర్లో మేం పనిమీద వేరే చోటికి వెళ్లాల్సి వచ్చింది. ఎంతో మీమాంసపడి ఆఖరికి మా జంతువుల్ని మా ఇంటావిడ మాషా మామ్మ దయాదాక్షిణ్యాలకి వదిలిపెట్టి వెళ్లాం.

మూడు వారాల తర్వాత తిరిగివచ్చి చూద్దును కదా అలీస్క ఉండే మకాం ఖాళీగా ఉంది. నేను గబగబా మాషా మామ్మ దగ్గరికి పరిగెత్తాను. "మీరు వెళ్లిన రెండు రోజులకి పారిపోయింది ఆ నక్క. కంచం పట్టుకుని పొద్దుటే వెళ్లాను, అది ఎగురుకుంటూ వస్తుందనీ నేననుకున్నాను. కాని అది ఎగురుకుంటూ రాలేదు. తలుపు చూస్తే ఓరగా తీసి ఉంది. రాత్రి గడియ వెయ్యడం మర్చిపోయానేమో మరి! జిత్తులమారి నక్క కదా!... అరె! అదేమిటి, ఏడుస్తున్నారు? పీడావిరగడై పోయిందని సంతోషించక! దానితో ఎంత యాతన పడ్డారు కారు మీరు!" అంది.

అలీస్క పారిపోయి ఇరవై రోజులు దాటిపోయింది. ఏ ప్రమాదం జరక్కుండా ఉంటే తప్పకుండా ఒక్కసారైనా వస్తుందనే నాకు నమ్మకం.

వెర్రి భ్రమకొద్దీ నేను దాని దొడ్డి కప్పుమీద ఒక మాంసం ముక్క పెట్టాను. అది పొద్దుటిదాకా అలానే ఉంది. మర్నాడు పొద్దుటికి అది లేదు. కాని ఆ పక్కనే మట్టిలో పిల్లి అడుగుజాడలు కనిపించాయి.

మేం మళ్లీ మా బస్తీకి వెళ్లిపోయాం. తిరిగి మార్చి నెలలోనే మాషా మామ్మ దగ్గరికి వెళ్లగలిగాను.

వసంత రుతువు. శోభాయమానంగా ఉన్న రోజు. నా జ్ఞాపకాలకి పదును తగ్గింది. అన్ని స్మృతులూ కడకి కాలంతో మాసిపోతాయి... ఆ దొడ్డిలో ఉన్న గూటి దగ్గరికి వెళ్లకుండా చూసుకున్నానంతే.

ఆ రాత్రి నాకు అలీస్క కలలోకి వచ్చింది. దాని గొంతు వినిపించి మెలకువ వచ్చింది. కీచురాయిలాగా 'గీ'మని సంతోషభరిత ఆశ్చర్యాన్ని వెల్లడి చేసే గొంతు. దీపం వేశాను. కాసేపు చదువుకుని మళ్లీ పడుకున్నాను. మంచుమీద పరిగెత్తిన జాడలు నా మంచం ఉన్న గది కిటికీ దాకా రావడం ఉదయం కనిపించింది. నా గుండె ఒక క్షణం ఆగిపోయింది. అయిదు వేళ్లు పడ్డ జాడలు, అలీస్కవిలాగే ఉన్నాయి.

ఆ గుంటనక్క బతికే ఉందా? ఏ అస్పష్టమైన స్మృతులో దాన్ని సరిగ్గా నేను ఉన్న ఆ రాత్రే మాష మామ్మ ఇంటికి తీసుకు వచ్చాయా? లేక ఆ జాడలు వేరే జంతువువి ఏమో! నాకు తప్ప ఎవరికీ అక్కర్లేని జంతువు, నేను స్నేహం చేసుకోవడం వల్ల నా బాధ్యత కిందికి వచ్చి, నేను కాపాడలేకపోయిన జంతువు ఒంటరిగా ఉండిపోయిందనే ఊహ భయంకరంగా ఉంటుంది.

అలీస్క... ఎక్కడినుంచి వచ్చిందో ఏమో ఎవరికీ తెలియదు, ఎక్కడికి పోయిందో కూడా ఎవరికీ తెలియదు. మార్చి నెలలో ఆ రాత్రి చితచితలాడే మంచులో పడిన జాడలు దేనివో నాకెన్నటికీ తెలియదు...

Anil

Alice by **Y. Drunina**
First Published by Raduga Publishers, 1988,
Illustrations by V. Kostytsin

అలీస్క

యు. ద్రూనినా

బొమ్మలు : వి. కొస్తీత్సిన్
అనువాదం : ఆర్వియార్
సంక్షిప్తీకరణ, నవీకరణ : మంచి పుస్తకం
భారతదేశ మొదటి ముద్రణ : మంచి పుస్తకం
ప్రచురణ కాలం : ఫిబ్రవరి 2013
ISBN : 978-93-80153-91-9
ప్రతులు : 2000
వెల : రూ. 45/-

మంచి పుస్తకం

ప్రచురణ, ప్రతులకు :
మంచి పుస్తకం
12-13-439, వీధి నెం. 1
తార్నాక, సికింద్రాబాదు - 500 017
ఫోన్ : 94907 46614.
email : info@manchipustakam.in
website : www.manchipustakam.in

ముద్రణ :
చరిత ఇంప్రెషన్స్
1-9-1126/బి, అజామాబాద్,
హైదరాబాదు - 500 020,
ఫోన్ : 040 - 2767 8411

ISBN 978-93-80153-91-9
9 789380 153919